
ఆంధ్రభూమి - నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ వారి అంతర్జాతీయ ప్రప్రధమ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# వంశవృక్షం



స్ప్రింగ్ డోర్ త్రోసుకుంటూ లోపలి కొచ్చాడో ముసలోడు.

అతడు కంటబడటం ఆలస్యం నా మొఖంలోని రక్తమంతా ఎవరో తరిమినట్టు పారిపోయింది. ఫైలులో తలదూర్చి బిజీగా వున్నట్టు నటిస్తూండిపోయాను.

అతడు దగ్గరికొచ్చాడు. నా టేబుల్ కెదురుగా నిలబడ్డాడు. నన్ను నిలదీయడానికి ఖద్ధరు చొక్కా తొడుక్కొచ్చిన హరిశ్చంద్రుడేమో అన్పించిందో క్షణం. గాభరా పడకుండా వుండలేక పోయాను.

మెల్లగా తలెత్తి అపరిచితుడ్ని చూసినట్టుగా చూశాను.

"నమస్కారం ఆర్డీవో గారూ!" రెండు చేతులూ కలిపి జోడించాడు.

అధికార దర్పంతో తలపంకించి ఏవిటన్నట్టు కళ్ళతో ప్రశ్నించాను.

"క్షమించాలి. చాలా సార్లొచ్చి మిమ్మల్ని విసిగించాను. ఇక మిమ్మల్ని ఇబ్బంది పెట్టనని చెప్పెళ్దామనొచ్చాను"

గతుక్కుమన్నాను. కొంపదీసి వాళ్ళూ వీళ్ళూ రాజీ పడిపోయారా ఏమిటి ఖర్మ!

యాభై వేల మూటని బల్లమీద పెట్టందే అతగాడి తాలూకు ఫైలు ముట్టనని ఖండితంగా చెప్పేను. బేరానికవకాశమూ ఇవ్వలేదు. దానికిప్పుడు రెక్కలు రాలేదు కదా?!

"పిటీషను ఉపసంహరించుకుంటే తాశిల్దారు ఆర్డరే ఫైనలవ్వుద్ది. మీ భూమి కాస్తా వాళ్ళ కెళ్ళిపోద్ది" బెదిరింపు అస్త్రం ప్రయోగించి నవ్వేను.

"తెలుసండి. అలా జరగాలని రాసుందేమో అలాగే కానీండి...!"

"నువ్వెక్కడో పిచ్చోడిలా వున్నావు. యాభైవేలకోసం బంగారం లాంటి భూమిని పోగొట్టుకుంటానంటావేంటి?"

"అంతకంటే విలువైన భార్యే పోయిందండి"

ఒక్క క్షణం ఆగి కళ్ళు తుడుచుకుని తిరిగి అన్నాడు. "ఆవిడకి కేన్సరొచ్చింది. చేతిలో చిల్లిగవ్వలేదు. ఆమెకెలాగైనా నయం చేయించాలని పొలం బేరం పెట్టాను. ఆ భూమి తమదంటూ దాయాదులు పేచీకి దిగారు. చిఠా, అడంగళ్ళు మార్పించి తిమ్మిని బమ్మిని చేశారు. తాశిల్దారు గార్ని ఆకట్టుకుని ఆర్డరు తెచ్చుకున్నారు. తమరు న్యాయం చేస్తారని కాళ్ళరిగేలా తిరిగాను. ముందు బరువు పెట్టమన్నారు. తర్వాత పెడతాను మహాప్రభో అన్నాను. తమరు కనికరించలేదు..."

"నేను పులినేనయ్యా. మాంసమే తింటాను. కాని నువ్వు గంగిగోవువని గ్యారంటీ లేదు కదా? పనయ్యాక పత్తా లేకుండా పోవడం మానవనైజం!"

గత పాతికేళ్ళ నుంచి మనుషుల్ని – ముఖ్యంగా నా దగ్గరకొచ్చే వాళ్లని కాచి వడబోసిన వాడ్ని. హుఁ నా ముందా కుప్పిగంతులు?!

"తమర్ని తప్పుబట్టేంత వాడ్ని కాదండి. బతికి చెడ్డవాడ్ని. నా పరిస్థితి వివరించాను.

తమ మనస్సు కరగలేదు. పోనీండి. ఇక మీ ముందుకు రాను. శలవండి...”

“నీ భూమి...!”

“నాదేనండి. తమరు సంతకం చేసి వుంటే నాదిగానే వుండేది. మిమ్మల్ని తృప్తి పరచలేకపోయాను. సంతకం పెట్టడానికి మీకు చెయ్యి రాలేదు. నా భూమి నా చేజారి ఎవరికో పోతుంది. పోనీండి. దాని అవసరం నాకింక లేదు. ఆ ముక్క చెప్పి పోదామనే పనిగట్టుకుని ఇంతదూరం వచ్చాను...”

“నిక్షేపం లాంటి అయిదెకరాల భూమి అక్కర్లేదా?”

“ఆరడుగుల నేల చాలండి...” మరోసారి దండం పెట్టి వెళ్ళిపోయాడు.

సందేహం లేదు. ఇతగాడు నిజంగా సత్యహరిశ్చంద్రుడి కాలంనాటి పిచ్చోడే. పరుల సొమ్ము అడ్డంగా పడవేసుకుపోదామని చూసే ఈ కాలంలో తన సొత్తుని ఇతర్లు లాక్కుంటూ వుంటే మీనమేషాలు లెక్కపెడుతున్నాడు!

మనస్సు చేదు కాగా నాలో నేను ధుమధుమలాడాను.

యాభై వేలు కాకపోయినా నలభై విసిరినా పని చేసి పెట్టే వాడ్ని. ఆ తాశిల్దారు అవతలి పక్షం నుంచి లకారం నొక్కేట్ట. వారి ఆట కట్టించమని ఇతగాడు పిటీషనైతే పెట్టేడు గాని పైసలు విదిలించడానికి సిద్ధపడలేదు. పచ్చనోట్లు చూపించందే పరోపకారం మాట దేవుడెరుగు ఎవడూ ‘పని’ చెయ్యడన్న ఇంగిత జ్ఞానం లేకపోయింది. ప్ఛ్..... పూర్‌ఫెలో!

మెదడు మబ్బు కమ్మినట్టయ్యింది. ఫైలు మూసేసి బెల్ కొట్టాను.

బిళ్ళ బంట్రోతు పరుగునెళ్ళి చెప్పగా డ్రైవరు జీపు తీసుకొచ్చాడు. ఎక్కి దర్జాగా కూర్చున్నా నన్నమాటే గాని ఆ ముసలోడి ఆలోచనలు బుర్ర తినడం మానలేదు.

ఇంటి ముందు జీపు దిగి లిఫ్ట్ వైపు నడుస్తోంటే సూర్యనారాయణరావు ఎదురయ్యారు.

“రచయితగారూ బావున్నారా” బావుండదని పలకరించాను.

మందహాసం చేశారు.

“ఈ మధ్యేం రాశారూ!” సాహిత్యం మీద ఆసక్తి వుండి కాదు ఏదో మాట కోసం అడిగానంతే.

“మా వక్కంతం వారి వంశవృక్షం రాస్తున్నాను...”

“మన గొడవా మన గొప్పా రాసుకోక మా తాతలు నేతులు తాగారు మా మూతులు వాసన చూడమనడం ఎందుకూ!”

“మన పూర్వీకులెలా బతికారో మన ఈ స్థితికి వాళ్ళెలా కారణమయ్యారో తెలుసుకోవడం ఎంతో అవసరం. వారి నడతా నడవడికా, బాటా మాటా, రీతీ నీతీ తెలుసుకుంటే మనల్ని మనమింకా బాగా సరిదిద్దుకోగల్గుతాం. సరైన బాట పట్ట గల్గుతాం”

"మీ చాదస్తం గాని దాని వల్ల ప్రయోజనం లేదండీ. పరమ వేస్ట్. ఎవర్రాసినా మా వాళ్ళు వీరులు శూరులు ధనవంతులు దానకర్ణులు అనే రాస్తారు. మిమ్మల్ని తప్పుబట్టడం లేదు..."

నవ్వేరు. "నేను మాత్రం అసత్యాలు గాని అతిశయోక్తులు గాని రాయట్లేదు. గొప్పకోసం యధార్థాన్ని వక్రీకరించట్లేదు. వీలైనంత సమాచారాన్ని సేకరించి విన్నదీ కన్నదీ పెద్దలు చెప్పిందీ జోడించి రాస్తున్నాను"

"వెనకటి కథలూ గాథలూ మనకెందుకండీ. మనం నడవాల్సింది ముందుకీ మున్ముందుకీనూ!"

"గతంలో మంచి ఎంత వున్నా దాన్ని స్వీకరించి ముందుకు సాగిపోవాలి. మన తర్వాతి తరాల వారికి మనం ఆదర్శ ప్రాయులమవ్వాలి. అంతే తప్ప వంశచరిత్రలో మాయని మచ్చలుగా, కుక్కమూతి పిందెల్లా మిగిలిపోకూడదు. ఏమంటారు?"

"కులమతాలంటూ కుంచించుకుపోవద్దని చెప్పాల్సిన వారు వంశాలూ గోత్రాలూ అంటూ వెనక్కెనక్కి పోతున్నారంటాను"

"ప్రతి మనషికీ ఒక చరిత్ర ఉంటుంది. ప్రతి మనిషికీ ఒక వంశం ఉంటుంది. ప్రతి వంశానికీ ఒక చరిత్ర ఉంటుంది. తాను జన్మించిన వంశం గురించిన చరిత్ర తెలుసుకోవడం మనిషి కర్తవ్యం"

మరి తర్కించడం ఇష్టంలేక, "మీకో నిజం చెప్పనా? మన పూర్వుల కన్నా మనమే చాలా చాలా గొప్పవాళ్ళం. వాళ్ళకులేని చదువులూ సంధ్యలూ ఆశలూ అవకాశాలూ భుజకీర్తులూ కిరీటాలూ మనకున్నాయి. ఆలోచించండి" అన్చెప్పి లిఫ్ట్ ఎక్కాను.

"ఇవాళ పెందరాళే వచ్చేశారేంటీ" మంచినీళ్లిస్తూ అంది ఇల్లాలు కుసుమ.

"ఇద్దరు పిచ్చోళ్లు తగిలారివాళ..." చొక్కా తీస్తూ అన్నాను.

"మీ దృష్టిదోషమేమో?" పెదవి కొరుక్కుంటూ నవ్వింది.

"ఏం కాదు. ఒకాయన నాలుగు రాళ్లివ్వడానికి వెనుకాడి వజ్రాల మూట జారవిడిచాడు. ఇంకో ఆయన ప్రేమ కథలు గీక్కోక వంశ పురాణం రాస్తున్నాడు!"

ఆమె కళ్లు మెరిశాయి.

"మన సూర్యనారాయణరావు గారా? ఆయన అష్టదిక్పాలకుల గురించి చాలా గొప్పగా రాస్తున్నారు. ఎన్ని కొత్త సంగతులు చెబుతున్నారో చెప్పలేను. మీరూ చదవకూడదూ?"

"కుబేరుడి కథొచ్చినప్పుడు చెప్పు, చదువుతాను" తమాషాగా నవ్వుతూ అన్నాను.

బుగ్గలు నొక్కుకుందావిడ. "నాకు తెలీకడుగుతానూ మనకున్నది చాలదా, ఆ ముసలాయన్ని లంచం ఇవ్వలేదని బాధ పెట్టడం ఎందుకు చెప్పండి. ఇదంతా మూట

గట్టుకుని పట్టుకెళ్తామా ఏమిటి!"

"పట్టుకెళ్ళను. కొడుక్కీ మనవలకీ మునిమనవలకీ ఇచ్చిపోతాను"

"హవ్వ!"

"మా తాత మా నాన్నకి రెక్కలే ఇచ్చాడు. మా నాన్న నాకు చదువే ఇచ్చాడు. నేను నా కొడుక్కీ వాడి కొడుకులకీ కోట్ల ఆస్తి ఇస్తాను"

"మీరిస్తారు సరే వాళ్ళు నిలుపుకోవద్దూ! కూడ బెట్టింది చాలనుకుని ఇకనైనా పుణ్యం పురుషార్థం కలిసొచ్చే పనులు చెయ్యండి. మనం పోయినా మన పేరుంటుంది"

"దానికింకా సమయం వుందిలే. రిటైరయ్యాక చూద్దాం..."

"మంచిపని చెయ్యడానికి సమయం సందర్భం ఉండాలేవిటి. మనసుండాలి గాని ఎప్పుడైనా చేయొచ్చు. నలుగురికి పెట్టిన ముద్దే వైతరిణిని దాటిస్తుంది!"

నుదురు ముడివేసి ఆమె వంక చూశాను. ఆమె కళ్ళనిండా ఆర్తి! దాని వెనుక తడి!

మాట మారుస్తూ అన్నాను "చూద్దాంలే. పూజలూ పునస్కారాలూ చేస్తున్నాం. గుళ్ళకీ గోపురాలకీ తిరుగుతున్నాం. ప్రస్తుతానికవి  చాల్లే. అబ్బాయి ఫోన్ చేశాడా!"

"ఇంకాలేదు. ఈ పాటికి చెయ్యాల్సిందే మరి...!"

"ఇంకో ఏడాదిలో మెడిసిన్ పూర్తవుతుంది. ఆ తర్వాత హౌస్ సర్జన్సీ చేసేస్తే ప్రాక్టీసు స్టార్ట్ చెయ్యొచ్చు. ఆసరికి మన రాజమండ్రిలో హాస్పిటల్ కట్టించెయ్యాలి. అందుకోసం అప్పుడే ముగ్గులు పెడుతున్నాన్లే. శివార్లలోని రెండెకరాల ప్రభుత్వ పోరంబోకుని బినామీ పేరు మీద పట్టా చేయించాను. అప్పటికా ఏరియా బాగా డెవలప్ అవుతుంది"

"ఎమ్మెస్ చేసి హార్ట్ స్పెషలిస్టు నవుతానంటున్నాడు..."

"చెయ్యనీ. అప్పుడు తండ్రి మనీ స్పెషలిస్టు, కొడుకు హార్ట్ స్పెషలిస్టు అంటావు కాబోలు!" బిగ్గరగా నవ్వేను.

ముసిముసిగా నవ్వింది. "అంతే తప్ప దారి మార్చుకోనంటారు"

"పిచ్చిదానా! ఇదే రహదారి!" ఆమె మొఖంలోని రియాక్షన్ చూడటానికిష్టం లేక గదిలోకి నడిచాను.

మంచం మీదకి చేరితే చాలు ఇట్టే నిద్రాదేవి ఒడిలోకి జారిపోతాను. అలాటి దివాళెంచేతో పొడికళ్ళు పడ్డాయి.

నిద్ర రాక అటూ ఇటూ దొర్లుతోంటే మా నాన్న గుర్తొచ్చారు.

నల్లగా బక్కగా వుండేవారు. ఎప్పుడూ ఖాకీ దుస్తులే ధరించేవారు. భుజానికి ఉత్తరాల సంచి వ్రేలాడేది. సైకిల్ మీద తిరుగుతూ ఊళ్ళోనూ, లంకలోనూ ఉత్తరాలు పంచేవారు.

తను పోస్టుమ్యాన్ అయితేనేం కొడుకులు బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయి కెదగాలని అనుక్షణం తపించేవారు. అనవసరపు ఖర్చని చెప్పి తనకంటూ చిన్న చిన్న

సరదాలకు కూడా వుంచుకోకుండా ప్రతిపైసా మా కోసమే ఖర్చు చేసేవారు. చాలీచాలని జీతమవడంతో సాయంత్రం వేళ కిరాణా కొట్లలో పద్దులు రాసేవారు.

గ్రామస్తులు పండ్లూ పచ్చళ్ళూ కాయగూరలూ వడియాలూ ఇచ్చి మా కుటుంబానికి చేదోడుగా నిలబడేవారు.

ఎండ ముదిరినా, వాన ముంచెత్తినా ఉత్తరాల బట్వాడా ఒక్కరోజూ ఆలస్యం చేసేవారు కాదు. "ఉత్తరాలు మోసుకొచ్చే ఊసుల కోసం ఎందరో ఆశగా ఎదురుచూస్తూంటారు" అనేవారు. నిజంగా ఆయన రాకకోసం ఎన్నో జతల కళ్ళు ఎదురు చూసేవి!

తాత పొగాకు వ్యాపారం చేసేవారు. పెట్టె నెత్తిన పెట్టుకుని సంతలకు తిరిగేవారు. అసలు దాని గురించే గోదావరి జిల్లా నుంచి గుంటూరు జిల్లాకి వలస వచ్చారాయన. నాన్నా నేనూ అక్కడే పుట్టి పెరిగాం. తాత వ్యాపారం బాగానే సాగేది కాని ఒకసారి అగ్ని ప్రమాదంలో పొగాకు కట్టలు తగలబడి పోయాయి. కోలుకో లేనంతగా నష్టపోయారు. తెలిసిన వాళ్ళద్వారా ప్రయత్నించి నాన్నని అప్పుడే ప్రారంభమైన తపాలా సర్వీసులో చేర్పించారు.

అన్నయ్యా నేనూ బాగా చదువుకున్నాం. అన్నయ్య హెడ్మాస్టరయ్యాడు. నేనీ మధ్యనే ఆర్డీవోగా గోదావరి జిల్లాకే వచ్చాను.

మా పెద్దతాత, చిన్న తాత, వాళ్ళ కొడుకులూ మనవళ్ళూ ఈ ప్రాంతంలోనే ఉంటున్నారు. వాళ్ళకీ మాకూ మధ్య రాకపోకల్లేవనే చెప్పాలి. నాన్న బ్రతికున్న రోజుల్లో ఎక్కువగానే వెళ్తూండేవారు గాని నేనెన్నడూ వెళ్ళలేదు.

ఓ సారెళ్ళి వంశస్తుల్ని కలవాలనుంది గాని వాళ్ళు నా హోదాని స్వప్రయోజనానికి ఉపయోగించుకుంటారేమోనని మిన్నకుండి పోయాను.

"నిద్ర రావట్లేదా? ఇవాళేమైంది మీకు?" విడ్డూరపడింది కుసుమ.

"మా నాన్న తాతా గుర్తొస్తున్నారు. మా అమ్మ తాయారమ్మ. నాన్న నరసింహమూర్తి. తాత సుబ్బారాయుడు. నానమ్మ మహాలక్ష్మమ్మ. ముత్తాత... నరసింహాయి. అవునదే పేరు. ఆ పేరే మా నాన్నకి పెట్టారు. మా తాత తల్లి పేరు.....!"

"శేషమ్మ. అత్తగారు చాలాసార్లు చెప్పేరు. మీరెప్పుడైనా తద్దినాలు పెడితేగా పెద్దల పేర్లు గుర్తుండటానికీ!"

"మా అన్నయ్య పెడుతున్నాడుగా. ఎప్పుడో అప్పుడు కాశీగయలు వెళ్ళకపోం అప్పుడొకే సారి పెట్టేస్తాను. అక్కడ పెడితే సంవత్సరీకాల బెడద ఉండదు"

"ఏడాదికో మారు మూడు తరాల పెద్దల్ని తలచుకుని కృతజ్ఞతా సూచకంగా ఇంత పిండం పెట్టడం మీకు బెడదగా అన్పిస్తోందా?!"

"ఉద్యోగస్తుల కవన్నీ కుదుర్తాయేవిటి లెద్దూ. మరీ సెంటిమెంటల్ ఫూల్‌వి కావద్దు.

మా అమ్మమ్మ పేరు మహాలక్ష్మి. ఆ తాతయ్య పేరు నరసింహులు. ఆయన తల్లిదండ్రుల పేర్లు నీకు తెలుసా కుసుమా!"

"నాకూ తెలీదు. మీ అమ్మగారు బ్రతికున్నప్పుడు అడిగుండాల్సింది"

"అయితే ఇప్పుడా పేర్లు మనకి తెలిసే అవకాశమే లేదంటావా?" చటుక్కున లేచి కూర్చుంటూ అడిగాను.

"మీ మావయ్యకి తెలిసుండొచ్చు. ఆయనా మీలాటి వాడే అయితే ఇంతే సంగతులు"

"ముత్తాత పేరు తెలీక పోవడం... దారుణ మన్పించట్లేదూ?"

"దారుణం కాదు విషాదం!"

"నాకు మూడో తరం పేర్లే తెలీట్లేదు. ఆ సూర్యనారాయణరావు గారు మూడు నాలుగు తరాల వారి పుట్టు పూర్వోత్తరాలు, వాళ్ళ సంతానం, మళ్ళీ వాళ్ళ సంతానం తాలూకు వివరాలూ ఎలా సేకరిస్తున్నారో!"

"తపన ఆర్ద్రత పట్టుదల వుండి తవ్వుకుంటూ పోతే వేళ్ళు కన్పించి తీరతాయి. అప్పుడెప్పుడో 'రూట్స్' నవల తెలుగు అనువాదం 'ఏడుతరాలు' మీ ఉద్యోగి ఎవరో మీ బర్త్‌డేకి ప్రెజంట్ చేశారు గుర్తుందా?"

"ఆ సంగతి గుర్తుంది గాని నేను చదివినట్టు గుర్తులేదు"

"మీరసలు అట్ట తిప్పితే కదా గుర్తుండటానికి. నేను చదివాను. అందులో హీరో పూర్వీకుల్ని ఎక్కడ్నుంచో బానిసలుగా తీసుకెళ్తారు. అడుగడుగునా ఎన్నో కష్టాల కోర్చి బతికి బట్ట కడతారు. చదువుతుంటే కళ్ళమ్మట నీళ్ళు ఆగవనుకోండి"

"అదంతా ట్రాష్. మనిషిక్కావాల్సింది భవిష్యత్తు గాని గతం కాదు"

"భవిష్యత్తుకు గతమే కదా పునాది!"

"అవన్నీ పుస్తకాల కబుర్లులెద్దూ. ఇంక పడుకో నిద్రొస్తోంది" రాని ఆవలింత తెచ్చుకుంటూ అన్నాను.

* * *

కలెక్టర్ పర్యటనకు ఏర్పాట్లు చూస్తోంటే ఆఫీసు ఫోన్ మ్రోగింది.

"ఆర్డీవో ప్రసాద్ గారేనా?"

"వూఁ... ఎవరు?"

"నేను పెదనాన్నా మీ పెదతాతగారి మనవడ్ని. మన చినతాత గారబ్బాయి నారాయణ స్వామి ఇవాళ పొద్దుట కాలం చేశారు. మీరు వెంటనే బయల్దేరి రావాలి పెదనాన్నా..."

"కలెక్టర్‌గారొస్తున్నారు. నాకు కుదరదు..." నిష్కర్షగా చెప్పేను.

బంధుత్వాలు తిరగేసి వంశస్తులన్చెప్పి వూపుకుంటూ వెళ్ళేంత చనువు, అవసరం ఏం లేవు!

"నారాయణ స్వామి బాబాయి మీతోనే తలకొరివి పెట్టించమన్నారు"

"నాతోనా?! ఆయనెవరో నాకు తెలీదే!"

"కాని మీరాయనకి తెలుసు. బాబాయికి సంతానం లేదు. మీ చిన్నప్పుడు మిమ్మల్ని పెంచుకోవాలని తీసుకొచ్చార్ట. మీరు బెంగపెట్టుకోవడంతో మీ నాన్నగారొచ్చి తీసుకు పోయార్ట..."

ఆ సంగతులు ఎప్పుడో చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది. అవి సూచాయిగా గుర్తొచ్చాయి.

ఇన్నాళ్ళూ లేనిది ఇప్పుడవన్నీ కెలుకుతూ పిలుస్తున్నారంటే దినకర్మల ఖర్చు నా నెత్తి మీదకి తోసెయ్యడానికేమో?!

నా ఊగిసలాటని గ్రహించినట్టుగా "కర్మకాండల కయ్యే ఖర్చు కోసం కొంతసొమ్ముని తలగడ క్రింద పెట్టుకుని మరీ చనిపోయారు బాబాయి..." అన్నాడతడు.

"ఎప్పుడో చిన్నప్పుడోసారి మీ ఊరు వచ్చినట్టు గుర్తు. ఎవరూ సరిగ్గా తెలీదు..."

"ఒక సారొస్తే అన్నీ తెలుస్తాయి. అంతా తెలుస్తారు"

"మీరంతా ఉన్నారు కదా. ఎవరొకరు కానిచ్చెయ్యండి. ఎవరు తల కొరివి పెట్టిందీ పోయినాయన చూడొచ్చాడా!"

"అంత మాటనేశారేంటి పెదనాన్నా! మంచం పట్టేక మిమ్మల్ని చూడాలనెంతో ఇదయ్యారు. మేం పిలుస్తామని చెప్పినా మిమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదని వద్దనేశారు. అలాటాయన ఆఖరి కోరిక తీర్చలేరా పెదనాన్నా?"

సందిగ్ధంలోకి తోసేశాడు. రానంటే నన్నో రాక్షసుడిగా చిత్రించడం ఖాయం. కుసుమకి చెబితే "ఇంకా అలా నిమ్మకి నీరెత్తినట్టు కూర్చున్నారేంటి పదండి వెళ్దాం" అంటుంది.

ఆ మాట అన్పించుకునే కన్నా నేనే అంగీకారం తెలిపేయడం ఉత్తమం. పైగా నా హోదా దృష్ట్యా కిట్టని వాళ్ళు వార్తని పేపర్లకెక్కించినా ఎక్కించొచ్చు! మీడియా వాళ్లు దాన్నో కథగా మలచి అప్రతిష్ఠ తేనూ వచ్చు!

"ఇంకో గంటలో బయల్దేరతాను. ఈలోగా మిగతా ఏర్పాట్లు చూడండి"

ఇంటికెళ్ళి విషయం చెప్పేను. వెంటనే "మీరు మీరేనా!" అంది కుసుమ.

తన కళ్ళ నిండా పరచుకునున్న అపనమ్మకం!

"నన్ను అర్థం చేసుకోవడం నీ తరం కాదు గాని పదపద..." ఫోజు కొట్టాను.

ఇద్దరం ఆఫీసు జీపులో బయల్దేరాం. రెండు గంటల ప్రయాణం. గోదావరి నానుకునే ఉందా చిన్న గ్రామం. రెండువేల గడప ఉంటుందేమో. నా రెవెన్యూ డివిజన్లోనే ఉంది.

ఇదిగిదిగో ఇక్కడే ఈ నేల మీదే మా తాతలూ ముత్తాతలూ అమ్మమ్మలూ అవ్వలూ తిరిగారు, జీవించారు అనుకున్నానో లేదో ఏదో తెలీని ఆత్మీయస్పర్శ గుండెల్ని నిమిరింది.

నా ఒళ్ళు పులకరించింది.

కుసుమైతే ఊరుని ఆరాధనా పూర్వకంగా చూస్తోంది.

నా ప్రోగ్రాం గురించి క్యాంపు క్లర్క్ చెప్పేడు కాబోలు తాశిల్దారు, ఆర్ఐ, విలేజ్ అసిస్టెంట్ వగైరాలంతా ఎదురొచ్చారు.

వారిని గంభీరంగా పలకరించి నారాయణ స్వామి బాబాయింటికెళ్ళాను.

బంధుమిత్రులు కళ్ళతోనే ఆహ్వానించారు. "మనోడే. దేశాలు పట్టుకుపోయినా గోత్రాలు మారిపోవు కదా!" అని చెప్పుకున్నారు.

ఇంట్లో కెళ్ళాం. హాలులో చాప మీద పార్థివ శరీరం. కాళ్ళకు దణ్ణం పెట్టుకొంటోంటే ఆడవాళ్ళు బావురుమన్నారు. తాశిల్దారు అందించిన పూలదండని శవానికి వేసి వీధిలోకి నడిచాను.

"ఎప్పుడో చెడ్డీ వేసుకున్నప్పుడు చూశాను. తాత నోట్లోంచి వూడిపడ్డట్టు వున్నావురా మనవడా" అందో పెద్దావిడ. మా అన్నయ్య ఎలా వున్నాడంటూ అడిగారు.

ఒక పెద్దాయన్ని తీసుకొచ్చి "గోపాలం తాత. మన వంశంలో ఈయనే పెద్ద" అని చెప్పేరు. అలాగా అని తల పంకించి వూరుకున్నాను.

కడపటి ప్రయాణానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంటే ఏడుకట్ల సవారీ గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. సింహాసనం మీద కూర్చునే వారికైనా ఈ సవారీ తప్పదు కదా అన్పించింది.

"మీ స్వగ్రామం ఇదేనని ఇక్కడికొచ్చేదాకా నాకు తెలీద్సార్" తెలీకపోవడం పెద్ద నేరమన్నట్టు ఫీలవుతూ అన్నాడు తాశిల్దారు.

"అబ్బే మాది అసలీ వూరు కాదండి. తాతముత్తాతల్నాడు తూర్పు నుంచొచ్చాం" ప్రక్కనే వున్న గోపాలంతాత అందుకున్నాడు.

ఆయన వంక అందరం ఆసక్తిగా చూశాం.

"అవున్రా అబ్బాయ్. అప్పట్లో భయంకరమైన దుర్భిక్షం వచ్చి పడిందంట. తినడానికి పిడికెడు గింజలు గాని, పచ్చని ఆకులు గాని లేవుట. అక్కడుంటే బతికి బట్టకట్ట లేమన్జెప్పి కడుపు చేత బట్టుకుని పిల్లా జెల్లాతో ఈ ఊరొచ్చారంట జానకయ్య. ఆయన మీతాతకి ముత్తాత అవుతాళ్ళే. ఆయనే మనకి తెలిసిన మన వంశ మూల పురుషుడు..."

"అందుకనేనా మనల్ని తూర్పు కాపులు, కొండ కాపులు అంటూ వుంటారు" అన్నాడో యువకుడు.

"అంతేగదా మరి. ఆ రోజుల్నీ ఆ నడిచొచ్చిన దారినీ మనిసన్నోడు మర్చిపోకూడ దొరేయ్. మనం ఇవాళిలా వున్నామూ అంటే అదంతా ఆ జానకయ్య చలవే. ఆయన్లేకపోతే మనమెక్కడుందుం చెప్పు?!"

వినేవాళ్ళున్నారు కదాని హరికథ చెప్పేస్తున్నాడు పెద్దాయన!

శవానికి స్నానం చేయించారు. కొత్త పంచె కప్పి ప్రదక్షిణలు చేశారు.

పాడె లేచింది. ఘొల్లుమన్నారు ఆడవాళ్ళు.

ముందు నిప్పు కుండ పట్టుకుని నేను నడుస్తోంటే బంధుమిత్రులు వెనుక అనుసరించారు. వాళ్ళలో మా వంశీకులే గాక గ్రామస్తులూ వున్నారు. రెండొందల మంది దాకా శవయాత్రలో పాల్గోవటం విశేషమే మరి.

శవయాత్ర అగ్రహారంలోకెళ్ళి ఒక పాత ఎత్తరుగుల ఇంటిముందాగింది.

పాడె దించారు. ఊరి పొలిమేరలో దింపుడు కళ్ళ ఆశతో పాడె దింపుతారు. మరి..... ఇక్కడెందుకు దించినట్టు?

నా మొఖం మీది ప్రశ్నార్థకాన్ని చూశారేమో గోపాలం తాత గొంతు సవరించు కున్నాడు.

"జానకయ్య భార్యా బిడ్డల్తో తూర్పు నుంచి ఈ ఊరొస్తూ ఈ ఇంటిమెట్ల మీద కూలబడిపోయాట్ట. ఒంటి మీద తెలివి లేకపోయేసరికి ప్రాణం పోయిందనుకుని ఆయన భార్యా పిల్లలూ గగ్గోలు పెట్టారంట. అప్పుడీ ఇంటి మహా ఇల్లాలు అన్నపూర్ణమ్మ కాశీ అన్నపూర్ణలా వచ్చి ముఖం మీద ఇన్ని నీళ్ళు చల్లగా ప్రాణం లేచొచ్చిందంట. ఇంత పెద్ద గ్లాసుడు మజ్జిగ ఇచ్చేర్ట. అది తాగేక తేరుకుని మనుషుల్లో పడ్డారంట. అదిగో అప్పట్నుంచీ ఆవిడ వల్లే పోయిన ప్రాణం తిరిగొచ్చిందని మనవాళ్ళ నమ్మకం. అంచేతే మనిళ్ళల్లో ఎవరు పోయినా సరే పాడెని ఇక్కడ దించుతాం. ఈ ఇంటి ఇల్లాలు నోట్లో ఇంత తులసి తీర్థం పోశాకే కాటికి తీసుకెళ్ళటం ఆనవాయితీగా వస్తోంది...!"

"అగ్రహారం బ్రామ్మలయ్యుండీ ఆ రోజుల్లోనే మడీ గిడీ అనకుండా ఆదరించారన్న మాట!" అబ్బుర పడుతూ ఎవరో అనగా అవునంటూ నేను కూడా తలాడించాను.

"అంతే కాదొరేయ్. ఈ బ్రామ్మలకి బోల్డు మడులూ మాన్యాలూ వుండేవి. జానకయ్య గోడు విని కదిలిపోయి చెరువు పక్కనున్న నాలుగెకరాలు కౌలుకి చేసుకోమన్నారు. ఊరికి కొత్తగా వచ్చిన వాడి మీద వారెంత నమ్మకముంచారో చూడు. ఆ ఆసరాతోనే మనోళ్ళిక్కడ నిలదొక్కుకున్నారు. మనోళ్ళూ తక్కువ తిన్లేదులే. ఓ పాలి సర్కారోడు కౌలుధాన్యం చెల్లించక్కర్లేదని ప్రకటించాడు. అయినా మనోళ్ళు చాటుగా బండ్ల మీద వారికివ్వాల్సిన ధాన్యాన్ని తోలుకెళ్ళి అప్పజెప్పేరు. వారంటే చర్మం ఒలిచి చెప్పులు కుట్టివ్వాలనేంత విశ్వాసంగా వుండే వారనుకోండి. వారూ తక్కువ చేసేవారు కాదు. కథ వచ్చినా కార్యం వచ్చినా ఎంతో అభిమానంగా అంతో ఇంతో ముట్టజెప్పేవారు. మనం గొప్పోళ్ళమని మీసాలు మెలేస్తూంటాం గాని ఓ తూరి వెనక్కి తిరిగి చూడం. మన ఎదుగుదలకి చేయి అందించినోళ్ళని గుర్తు చేసుకోం..." ఆవేదనగా అన్నాడు తాత.

"మన సోమయాజులుగారి భార్య మొన్ననే కాలం చేశారు గదా మరిప్పుడు తులసి

నీళ్ళెవరు పోస్తారు?" ఒకరడిగారు.

"కుసింత ఓపిక పట్టండ్రా....."

నాకూ ఉత్కంఠగా వుంది.

మా వంశపు మొక్కకి నీరు పోసి చేతులడ్డు పెట్టి మరీ కాపు కాచారు. ఆ మొక్క వృక్షమై శాఖోపశాఖలుగా నేడు విస్తరించింది. అందుక్కారకురాలైన అన్నపూర్ణమ్మ గారి వారసుల్ని చూడాలని చేతులు జోడించి దణ్ణం పెట్టుకోవాలని ఆత్రంగా వుంది.

లోపల్నుంచి ఒక బ్రాహ్మలాయన మడిగట్టుకుని ఏవో మంత్రాలు చదువుతూ వచ్చాడు.

ఒకరు శవం నోరు కొడవలి సాయంతో తెరవగా రాగిపాత్రలోని తులసి నీళ్ళు ఉద్ధరణితో మూడు సార్లు పోశారు.

అతి సమీపం నుంచి ఆయన్ని చూస్తూనే గుర్తుపట్టాను. వజవజ వణికాను. ఆ పైన గడ్డకట్టుకుపోయాను!

అతడు... ఆయన నిన్న మొన్నటి దాకా లంచం ఇవ్వలేని అశక్తతో న్యాయమర్థిస్తూ నా చుట్టూ తిరిగిన ముసలాయన!

అమాంతం నేను మరుగుజ్జుగా పిట్టగా పిపీలికంలా మారిపోయాను.

నా కాళ్ళ నుంచి తల వరకూ నా శరీరం యావత్తూ నిలువునా భూమిలోకి కృంగిపోయింది. ఇంకా ఇంకా లోలోపలికి జారిపోతోంటే భయభ్రాంతుడ్నై కేకలు పెట్టాను. ఇంతలో అదృష్టవశాత్తూ ఏవో వేళ్ళ మూలాలు చేతికందాయి. కళ్ళనుండి కన్నీళ్ళు ధారలు కడుతోంటే పశ్చాత్తాపంతో రగిలిపోతూ వాటిని గాఢంగా వాటేసుకుని గుండెలకు హత్తుకున్నాను!

**(ఆంధ్రభూమి, ఆదివారం 24.6.2012)**